రేపు ఆచార్య 'మూల' పుస్తక పరిచయ సభ

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి రచించిన 'రామాయణ, భారత, భాగవతాల్లో కొన్ని పాత్రలు' పుస్తక పరిచయ సభను జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కడపలో నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఆర్ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు, సభాధ్యక్షులుగా లక్ష్మీబాబు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాబురెడ్డి, పుస్తక పరిచయ కర్తగా వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ జి.వి.సాయి ప్రసాద్, విశిష్ట అతిథులుగా రాయలసీమ గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ రీజనల్ మేనేజర్ జి.వెంకట సుబ్బారెడ్డి, శ్రీరామకృష్ణ వానప్రస్తాశ్రమం కార్యదర్శి జి.సుబ్బిరెడ్డి, కోశాధికారి జి.శివరామిరెడ్డి, ఆత్మీయ అతిథులుగా కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో

ఘోర రోడ్డు ప్రమాదం

- కారుపై పడిన లారీ.. నలుగురు దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- చింతపుత్తాయపల్లెలో విషాద ఛాయలు
- రోడ్డు ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

మృతులు నాగిరెడ్డి, శిరీష, హర్షిత, రిషికేశ్‌రెడ్డి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె/బద్వేలు

కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్‌లోని నాలుగో మలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళ్తే...శనివారం ఉదయం 10 గంటల సమయాన బెంగళూరు నుండి కారులో బద్వేలు నియోజకవర్గంలోని చింతపుత్తాయపల్లె వెళుతుండగా తమిళనాడులోని లిల్లీపురం నుండి హైదరాబాదుకు చక్కెర లోడుతో వెళులతున్న లారీకి బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి సైడ్ వస్తున్న కారు పైన పడింది. లారీ ఇంజన్, లారీలో ఉన్న చెక్కర మూటలు పడటంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బసినేని శ్రీకాంత్‌రెడ్డి(32), అతని భార్య నాగిరెడ్డి శిరీష(27), వారితోపాటు శిరీష అక్క కుమార్తె, కుమారుడు హర్షితరెడ్డి(9), రిషికేశ్‌రెడ్డి(11)లో కూడా ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. వీరితోపాటు శ్రీకాంత్‌రెడ్డి కుమార్తె త్రిషికారెడ్డి (3), కోవటం శశికళ, సిద్ధమూర్తి స్వర్ణలత తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం వల్ల ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు సుమారు రెండు గంటలకుపైగా అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న చింతకొమ్మదిన్నె పోలీసులు జెసిబి సహాయంతో దాదాపు ఒకటిన్నర గంట సేపు శ్రమించి నుజ్జునుజ్జయిన కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను, క్షతగాత్రులను బయటకు తీశారు. వారిని 108 అంబులెన్స్ ద్వారా రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చింతపుత్తాయపల్లెలో విషాద ఛాయలు

బద్వేలు నియోజకవర్గంలోని చింతపుతాయపల్లె గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం 41 రోజు పూర్తి కావడంతో గ్రామమంతా జాతర జరుపుకోవడానికి సిద్ధమైంది. చింతపుత్తాయపల్లి గ్రామంలో ఏ చిన్న కార్యక్రమం జరిగిన శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ఎంతో సందడి చేసే వారు. ఈ రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబంతో మృతి చెందడంతో గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి లోనయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారులో ఇరుకున్న మృతదేహాలను తీస్తున్న జెసిబి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి కుటుంబం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దాసరి సుధ హుటా హుటిన కడప రిమ్స్ దగ్గరకు వెళ్ళి గాయమైన వారిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్స్‌కు సూచించారు. అనంతరం మార్చురీకి వెళ్ళి వారి భౌతికాయాలను సందర్శించి వెంటనే పోస్టు మార్టం చేయాలని డాక్టర్స్‌కు సూచించారు. అనంతరం పోలీసులతో మాట్లాడి వెంటనే కేసు నమోదు చేయాలని సూచించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బద్వేల్ జడ్‌పిటిసి పోలిరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి, బి.కోడూరు ఎంపిపి శేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులు లక్ష్మి నరసారెడ్డి, రోసిరెడ్డి, జయరామిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి నాయకులు రితీష్‌రెడ్డి పరామర్శ

బద్వేల్ నియోజకవర్గం చింతపుతాయపల్లె గ్రామానికి చెందిన వాసులు గువ్వలచెరువు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే బద్వేల్ నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త రితీష్ రెడ్డి కడప రిమ్స్‌లో వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్కడి నుంచే కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వారికి తక్షణమే గాయపడిన వారికి మంచి వైద్యాన్ని అందించాలన్నారు. పరామర్శించిన వారిలో జిల్లా డిసిసి బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందడంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఘాట్ రోడ్డులో లారీ, కారు ఢీకొన్న ఘటన బాధాకరమన్నారు. నలుగురు మృతి చెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. రోడ్డు ప్రమాదాలు తీరని విషాదాన్ని నింపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల రోడ్డు భద్రత నియమాలు విధిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రయాణాలలో భద్రత కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు.

రిమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న బద్వేలు ఎమ్మెల్యే సుధా

చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం

- రూ.5 లక్షలు తక్షణ ఆర్థిక సాయం
- ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం మంజూరు
- చిన్నారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ పరామర్శ

చిన్నారి తల్లితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

చిన్నారి మరణం చాలా బాధాకరం, నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారిని హత్య చేయడం మనసును కలిసివేసిందన్నారు. బాధాకరమైన సంఘటన్నారు. సమాజంలో మార్పు రావాలని తెలిపారు. ఎవరు కూడా ఇలాంటి ఆలోచన చేయరాదన్నారు. చట్టప్రకారం ఏం చేయాలో అది చేస్తామన్నారు. నిందితుడికి అన్ని రకాలుగా పూర్తిగా శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. చిన్నారి కుటుంబానికి ఉద్యోగం, ఇల్లు, ఇంటి స్థలం మంజూరు చేస్తున్నామన్నారు. తక్షణ సాయం కింద రూ.ఐదు లక్షలు అందజేసి, ఎఫ్ఐఆర్ మేరకు మిగతా పరిహారం వెల్లడిస్తామన్నారు. చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఆదిమూలపు సాయిశ్రీ, డిఎస్‌పి వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

నిందితుడి ఇల్లు నేలమట్టం : గ్రామంలో ఇలాంటి వ్యక్తి ఉండరాదంటూ గ్రామస్తులు జెసిబితో నిందితుడు దూదేకుల రహమతుల్లా ఇంటిని నేలమట్టం చేశారు. నిందితుడి మోరగుడి గ్రామం. తల్లి కువైట్‌లో ఉంది. నిందితుడు తాగుడుకు బానిసై సైకోలా ప్రవర్తిస్తాడాని స్థానికులు చెబుతున్నారు.

ప్రజా సంఘాల నిరసన : కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, దళిత సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు చిన్నారికి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని శిక్షించాలంటూ స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నాకు దిగారు. ఆస్పత్రి వద్ద ఉన్న కలెక్టర్‌ను నాయకులు కలిసి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శివ మోహన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వెంకటస్వామి, ప్రకాశం, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, సిపిఐ నాయకులు మిడుతూరు ప్రసాద్, దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కోలా ప్రసాద్ పాల్గొన్నారు. మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని జనసేన కో-ఆర్డినేటర్ నాగార్జున అన్నారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి : ఆవాజ్

బద్వేలు: మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్ బాషా, బద్వేల్ కమిటీ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ సత్తార్ డిమాండ్ చేశారు. చిన్నారి తల్లిదండ్రులకు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. హోం మంత్రి, ప్రభుత్వం చిన్నారి తల్లిదండ్రులకు అండగా ఉండాలన్నారు. వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.బి.రసూల్, ఎస్.ఖాజ గౌస్, మస్తాన్, అన్వర్, నాగూర్ పాల్గొన్నారు.

పిల్లలు, మహిళలకు రక్షణలేదు : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : సభ్య సమాజం తలదించుకునే విధంగా కంబాలదిన్నెలో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు, పసి పిల్లలకు, మహిళలకు ఇంట్లో, బయట, గుడిలో, బడిలో ఎక్కడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు కాలయాపన లేకుండా తక్షణమే శిక్షలు కఠినంగా అమలు జరిగినప్పుడే ఇంకొకసారి పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రబ్బా నరసింహులు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆది పాల్గొన్నారు.

కామాంధుడిని ఉరి తీయాలి : విద్యార్థి సంఘాలు

ప్రొద్దుటూరు : నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని ఉరి తీయాలని విద్యార్థి, యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య, ఎన్‌డిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కత్తి ఓబులేసు, రమేష్, బయన్న మాట్లాడుతూ నాలుగేళ్ల చిన్నారిని మోరగుడికి చెందిన రహమతుల్లా అనే వ్యక్తి దారుణంగా, కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన జుగుప్సాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణం సహాయం అందించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలోనాయకులు పవన్,చందు, రాజేష్ పాల్గొన్నారు.

మానవమృగాన్ని శిక్షించాలి : ఐద్వా

చిన్నారిని చిత్రహింసల పాలు చేసి హత్య చేసిన మానవ మృగాన్ని శిక్షించాలని ఐద్వా కార్యదర్శి ముంతాజ్ బేగం, పట్టణ అధ్యక్షులు సర్వేశ్వరి అన్నారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పసికందును చిత్రహింసల పాలు చేసి హత్య చేయడం దుర్మార్గమని తెలిపారు. సమావేశంలో ఐద్వా నాయకులు నాగలక్ష్మి, కరీమున్, మౌనిక, వైష్ణవి పాల్గొన్నారు.

బాలిక మృతి బాధాకరం : కాంగ్రెస్

చిన్నారి అత్యాచార ఘటన చాలా బాధకరమని కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు సమన్వయ కర్త ఇర్ఫాన్ బాషా పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి

కడప : చిన్నారి హత్యాచార ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని మూడేళ్ల చిన్నారిపై నిందితుడు రహమతుల్లా మృగంలా ప్రవర్తించడం దారుణమన్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌పి అశోక్ కుమార్‌కు ఫోన్లో ఆదేశించారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపిన మంత్రి, ప్రభుత్వపరంగా అండగా ఉంటామన్నారు. క్షమించరాని నేరం చేసిన నిందితుడు రహమతుల్లాను చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. భవిష్యత్తులో మరెవరైనా మహిళలు, చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తించకుండా ఉండేలా కఠినకంగా వ్యవహరిస్తామన్నారు.

బాధిత చిన్నారికి న్యాయం జరగాలి : డిసిసి

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన మూర్ఖపు కామాంధుడిని కఠినంగా శిక్షించాలని డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి పేర్కొన్నారు. బాధిత చిన్నారికి న్యాయం జరగాలన్నారు. ఇలాంటి పాశవిక చర్యలు మన సమాజాన్ని కలచివేస్తున్నాయని, చిన్నారులపై ఇలాంటి నరమృగాలు చేస్తున్న అఘాయిత్యాలను తక్షణమే ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని అక్కాయపల్లెలో ఉన్న సిద్ధిక్ మసీద్‌లో మహమ్మదీయా సిద్ధిక్ మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ముగింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా మతగురువు మౌలానా ముఫ్తి మొహమ్మద్ కరిముల్లా, మూలాన జలీల్, ఆయేషా కళాశాల కరస్పాండెంట్ జిలాని బాష, అబ్రహ్మాన్ ఇందాద్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, సిద్ధిక్ మస్జిద్ ప్రెసిడెంట్ కరీముల్లా, సెక్రటరీ సుభాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మర్ కోర్సు ద్వారా విద్యార్థులకు ఆధ్యాత్మికాన్ని నేర్పించడం ద్వారా సమాజంలో సంస్కారాలుగా తయారవుతారని పేర్కొన్నారు. 160 మంది విద్యార్థులు సమ్మర్ కోర్సుకు హాజరు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇటువంటి సమ్మర్ కోర్సును నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సమ్మర్ కోర్స్ కన్వీనర్ మక్బూల్ అహ్మద్, మౌలాలి, జమీల్ అహ్మద్, డాక్టర్ హిదాయతుల్లా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహానాడును వాయిదా వేసుకోండి

- వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

ప్రజల ప్రాణాలు కాపాడండి, మహానాడు కార్యక్రమాన్ని వాయిదా వేసుకోండి. లేదంటే ఇక్కడే పెద్ద ఎత్తున కరోనా విజృంభించే పరిస్థితి, ప్రమాదం నెలకొంటుందని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కడపలో జరగనున్న మహానాడు సభను వాయిదా వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం జెసి అతిది సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహానాడు నిర్వహణకు కరోనా ఉందనేది టిడిపి వారికి గుర్తులేదా? అని ప్రశ్నించారు. కేసులు పెరుగుతున్నాయి, కొత్త వేరియంట అంటున్నారు, మరణాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మహానాడును వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. లేదంటే ఇక్కడే పెద్ద ఎత్తున కరోనా విజృంభించే పరిస్థితి ఉందన్నారు. అధికారులు కూడా కరోనా గైడ్ లైన్స్ కూడా ఇచ్చారన్నారు. గైడ్ లైన్స్ ప్రకారం నలుగురు వ్యక్తులు గుమికూడవద్దని చెప్పారని పేర్కొన్నారు. టిడిపి వారికి ప్రజలన్నా, వారి ప్రాణాలన్నా లెక్కలేదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. గోదావరి పుష్కరాలు, కందుకూరు మీటింగ్ వంటి వాటిలో ఎంతో మంది చనిపోయారు, బాధ్యత కలిగిన వారైతే ఈ కరోనా పరిస్థితుల్లో వాయిదా వేసుకుని ఉండే వారన్నారు. ప్రజలకు చేసింది ఏమీ లేదు కానీ మహానాడుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఒక సంక్షేమ పథకం, ఒక ప్రాజెక్టు రాష్ట్రానికి తీసుకురాలేదన్నారు. ఏమి చేశారని రాయలసీమలో మీరు మహానాడు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, నిత్యానందరెడ్డి, పాకా సురేష్, దాసరి శివ, బిహెచ్ ఇలియాస్, షఫీ, శ్రీరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ నిరసన

మాట్లాడుతున్న విరసం నాయకులు వరలక్ష్మి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు చేపట్టాలని, మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబళ్ళ కేశవరావుతో సహా 27 మంది ఆదివాసీలు, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరుతో కేంద్రసాయుధ బలగాలచే హత్య చేయించారని, దీనిపై వెంటనే న్యాయ విచారణ చేపట్టాలని వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్టీసీ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందరరేగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ అమానుషమైన పద్ధతిలో "ఆపరేషన్ కగార్"ను కేంద్ర ప్రభుత్వం, రాజ్యాంగ నిబంధనలను కాలరాస్తూ, గిరిజనుల హత్యాకాండను అమలు పరుస్తోందని విమర్శించారు. దేశ పౌరులను, ఆదివాసీలను హత్య చేసి కార్పొరేట్ సంస్థలకు విలువైన అటవీ సంపద, ఖనిజ వనరులను ధారాదత్తం చేస్తున్నాయని మండిపడ్డారు. 'ఆపరేషన్ సింధూర్' ను అమెరికా జోక్యంతో నిలిపివేసి పాకిస్తాన్ తో చర్చలు చేపట్టారని తెలిపారు. సొంత దేశంలో మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు చేపట్టకుండా మోదీ ద్వయం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో ఆదివాసీలను తమ జీవనోపాధుల నుంచి పరాయికరణ చేస్తోందన్నారు. ఆర్‌సిపి నాయకులు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి విధానాలతో రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కారని, ప్రజాస్వామ్యాన్ని గొంతు నులిమేశారని చెప్పారు. విరసం రచయిత వరలక్ష్మి మాట్లాడుతూ మావోయిస్టులను అంతమొందించే పేరుతో హత్యాకాండకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం, బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో ప్రజానాయకుల ప్రాణాలను హరిస్తోందని, మ ృతి చెందిన వారి శవాలను అగౌరవపరుస్తూ, కుటుంబ సభ్యులకు శవాలను అప్పగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ హత్యాకాండను ప్రజలు, మేధావులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి వెంకట్ శివ, పౌర హక్కుల సంఘం నాయకులు సి.వెంకటేశ్వర్లు, సురేష్ బాబు, రెడ్డయ్య, రవిశంకర్, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గుర్రం గోపాల్, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, మల్లెల భాస్కర్, జెవివి నాయకులు శివరాం, ఆర్‌సిపి నాయకులు ప్రసాద్, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు 'సృజన' శ్రీనివాసరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసరెడ్డి, ఎఐటియుసి నాయకులు బాదుల్లా, మున్సిపల్ యూనియన్ నాయకులు సుంకర రవి, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు మల్లికార్జున్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, లోక్సత్తా నాయకులు కృష్ణ, బిసి సంఘం నాయకులు ఓబులేష్ పాల్గొన్నారు.

'ఉక్కు' ఏర్పాటుపై చిత్తశుద్ధిని నిలబెట్టుకోవాలి

- సదస్సులో ఇండియా కూటమి నేతలు

ప్రజాశక్తి -కడప అర్బన్

ఈ నెల 26 నుంచి 29వరకు కడపలో టిడిపి మహానాడు జరుగుతున్న నేపధ్యంలో జిల్లా ప్రజల ఆకాంక్ష కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేసి, విభజన హామీలు అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తికి తగినన్ని నిధులు కేటాయించి కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన ఉక్కు సాధన సదస్సు నిర్వహించారు. ఇండియా కూటమి నేతలు ఎన్.తులసిరెడ్డి, జి.ఈశ్వరయ్య, కత్తి నరసింహారెడ్డి, జి.చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిత్యకరువులతో తల్లడిల్లుతున్న రాయలసీమ కేంద్ర బిందువు కడప జిల్లాలో రూ.20వేల కోట్ల అంచనా వ్యయంతో, 10 లక్షల టన్నులు సామర్థ్యంతో ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో రాజశేఖర్‌రెడ్డి 2007 జూన్ 10వ తేదీన జమ్మలమడుగు మండలం, వేమగుంటపల్లి, తుముగుంటపల్లి, బొమ్మేపల్లి, అంబవరం, చిటిమిటిచింతల వద్ద ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఒయంసి) అధినేత గాలి జనార్ధన్‌రెడ్డి అధ్వర్యంలో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి శంఖుస్థాన చేశారని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయకుండా ప్రభుత్వ నిభందనలను ఉల్లంఘించారన్న ఆరోపణలతో కేటాయింపులన్నీ రద్దు చేయబడ్డాయని పేర్కొన్నారు. బ్రహ్మణి స్టీల్ ప్లాంట్ స్థానంలో ప్రభుత్వమే ఉక్కు ఫ్యాక్టరీ చేపట్టాలని డిమాండ్‌తో పోరాటాల కొనసాగాలని చెప్పారు. గడచిన నాలుగు దశాబ్దాలుగా జిల్లాలో పట్టుమని 10వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఒక్కటంటే ఒక్క పరిశ్రమ ఎర్పాటు కాలేదని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న చెన్నూరు చెక్కర పరిశ్రమ, ప్రొద్దుటూరు పాలకేంద్రం, నందలూరు ఆల్విన్, స్పిన్నింగ్ మిల్లులు, కెమికల్ ఫ్యాక్టరీలు, చిన్నా చితక పరిశ్రమలు మూతపడి అందులో పనిచేసేవారు వీదినపడ్డారని తెలిపారు. ఇటీవల పాలక ప్రభుత్వాలు తీసుకు వచ్చిన సంస్కరణల నేపథ్యంలో ప్రవేటు రంగంలో ఇబ్బడిముబ్బడిగా ప్రవేటు విద్యాసంస్థలు రావడంతో ప్రతి ఏటా డిగ్రీ పట్టాలు చేతపట్టుకుని పట్టణాలకు వలసపోయి అరకొర వేతనాలతో అర్థాకలితో అలమటిస్తున్నారని పేర్కొన్నారు. తరతరాలుగా దగాపడ్డ, వెనకబడ్డ రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు పై ఓటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు ఎన్.వెంకట శివ, వి.వీరశేఖర్, ఎల్.నాగ సుబ్బారెడ్డి, పి.సుబ్బరాయుడు, జి.వలరాజు, ఎన్. విజయలక్ష్మి, జి.వేణుగోపాల్, కేసీబాదుల్లా, శ్రీరాములు, గంగా సురేష్, వెంకట్రాముడు, మద్దిలేటి, మునయ్య, వెంకటరమణ, సిపిఎం నాయకులు అన్వేష్, లోక్సత కృష్ణ, ఎఐవైఎఫ్ ప్రభాకర్, నాగేంద్ర, ప్రదీప్, ఎఐఎస్ఎఫ్ అరుణ్, పీటర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండియా కూటమినేత ఈశ్వరయ్య

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు

కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ఆవిరాభం నుంచి నిర్వహిస్తున్న మహానాడు కడప జిల్లాలో కని.విని..ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, బద్వేలు ఇన్చార్జి రితీష్ రెడ్డి, పులివెందుల ఇన్చార్జి బీటెక్ రవి, జమ్మలమడుగు ఇన్చార్జి భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ ఎన్టీ రామారావు జయంతి సందరరేగా మహానాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. 43 సంవత్సరాల తరువాత కడప జిల్లాలో మహానాడు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు చెప్పారు. మూడు రోజుల కార్యక్రమంలో 27వ తేదీ మొదటి రోజు పార్టీ నిర్మాణం పై, 28న రెండవ రోజు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమము, గత ప్రభుత్వ వైఫల్యాలు చర్చిస్తామని పేర్కొన్నారు. 29న మూడవరోజు 5 లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మహానాడు ను విజయవంతం చేసేందుకు ఉమ్మడి జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని చెప్పారు. మహానాడు పై ప్రతిపక్ష పార్టీలు ఎన్ని విమర్శలు చేసినా వెనుక అడుగు వేసేది లేదని పేర్కొన్నారు. ఏదో ఒక సాకుతో మహానాడు ను ఆపేందుకు కరోనా బూచిగా చూపిస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి సొంత జిల్లాకు ఏమి చేశాడనే ప్రశ్నించారు. జిల్లాలో గత ప్రభుత్వ వైఫల్యం వల్ల సొంత జిల్లాలోనే పది నియోజకవర్గాల్లో ఏడు స్థానాలు టీడీపీ కూటమి కైవసం చేస్తుందని తెలిపారు. జిల్లాలో ఏదో జరుగుతుందన్న అపోహ తొలిగేందుకు జిల్లాలో మహానాడు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు జైళ్లకు వెళ్లారని, ఆయన తనయుడు జగన్ ప్రభుత్వంలో అధికారులకు అదేగతి పట్టిందని పేర్కొన్నారు. మహానాడుకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహానాడు ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్నారై తెలుగుదేశం పార్టీ కువైట్ ఉపాధ్యక్షులు షేక్ రహమతుల్లా కడపలో మొట్టమొదటిసారిగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్న పసుపు పండగ మహానాడు సందర్భంగా ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. శనివారం టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి 26వ డివిజన్ ఇంచార్జ్ చవలముడి శంకర్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షులు లోకేష్, భార్గవ్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు అనిల్, నాయకులు షేక్ ఇర్ఫాన్, నిజాం, ఫజు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిఒ గంగరాజు

'ఉపాధి'లో ఎలాంటి అవినీతి జరగలేదు

ప్రజాశక్తి - లింగాల

మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, పారదర్శకంగా పనులు చేపడుతున్నామని ఉపాధి ఎపిఒ గంగరాజు అన్నారు. మండల కేంద్రంలోని లింగాలలో శనివారం ఆయన తమ సిబ్బందితో కలసి ఉపాధి పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, కూలీలకు చెల్లించే వేతనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈనెల 21న మండల సర్వసభ్య సమావేశంలో ఉపాధి హామీలో అక్రమాలు జరిగాయని లింగాలకు చెందిన కో-ఆప్షన్ సభ్యుడు రసూల్ ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులపై తనిఖీ చేశారు. ఎక్కడ అవినీతికి జరగలేదని తమ తనిఖీలో వెల్లడైందని ఎపిఒ తెలిపారు. కూలీలతో మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరు, మస్టర్ల నమోదు కూలీలతో మాట్లాడే విధానం అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు పని దినాలు కల్పిస్తున్నట్లు కూలీలు తెలిపారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు

బోసిరెడ్డిపల్లెలో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు పంచాయితీ బోసి రెడ్డిపల్లెలో పోలేరమ్మ తిరుణాల శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎడ్ల పందేలే నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి పందేలను ప్రారం భించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ పెద్దిరెడ్డి

డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ బి.రామచంద్రుడు

రేషన్‌షాపుల నుంచే పంపిణీ

ప్రజాశక్తి - తొండూరు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ డీలర్లు ఇంటి వద్ద నుంచే నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ బి.రామచంద్రుడు తెలిప్పారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయన విఆర్‌ఒలు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి8 గంటల వరకు దుకాణాలు తెరిచి ఉంచాలని తెలిపారు. వృద్ధులకు ఇంటి వద్దకే పంపిస్తామన్నారు.

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో హరినాథ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండియు ఆపరేటర్ల ద్వారా పంపిణీని ప్రభుత్వం రద్దు చేయడంతో, డీలర్ల వద్ద నుంచి ప్రజలు రేషన్ బియ్యం తీసుకెళ్లాలని కోరారు. కాబట్టి డీలర్లు కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్‌ను పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి డీలరు తమ షాపు వద్ద సూచిక పట్టికను తప్పనిసరిగా పెట్టాలని ఆదేశించారు. స్టాక్ వివరాలను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి లోకేష్, డీలర్లు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న తహశీల్దార్ అక్బర్ బాషా

దువ్వూరు : రేషన్ సక్రమంగా పంపిణీ చేఆలని తహశీల్దార్ అక్బల్ బాషా సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయన మండలంలోని డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి కార్డుకు రేషన్ సరుకులు ఇవ్వాలన్నారు. బియ్యం, ఇతర వస్తువులు తప్పక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

26న బిసి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

జాతీయ బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఆర్ కృష్ణయ్య జనగణనతోపాటు కులగణన జరపాలని లోకసభలో కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందేలా పోరాడారు. ఈ సందర్భంగా ఈ నెల 26న బిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సందు శివనారాయణ తెలిపారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ఆర్ కృష్ణయ్య, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి యలగాల నూకనమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో జిల్లా సెక్రటరీ జనరల్ వెంకటరమణ రాజు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కత్తి విజయకుమార్, జాయింట్ సెక్రటరీ రమేష్ రాజు, కోశాధికారి రామసుబ్బ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ,పుల్లయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మహావీర్ మ్యూజియాన్ని సంరక్షించండి

ప్రజాశక్తి - కడప

శిథిలావస్థకు చేరుకున్న మహావీర్ మ్యూజియాన్ని సంరక్షించాలని కొండా పాలకొండయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండ సుబ్బయ్య కోరారు. శనివారం ఆయన మ్యూజియాన్ని సందర్శించారు. కడప రైల్వేస్టేషన్ వద్ద 1982లో ఇక్కడ శ్రీ భగవాన్ మహావీర్ మ్యూజియాన్ని ప్రారంభించారన్నారు. ప్రస్తుతం అక్కడ నూతన కలెక్టరేట్ ఉందన్నారు. దాదాపు 43 ఏళ్లు కావస్తున్న ఇలాంటి మ్యూజియం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఎంతో విలువైన వస్తువులున్నాయని, వాటిని ప్రజలు, విద్యార్థులు తిలకించడానికి దారి కూడా లేదన్నారు. కలెక్టర్ మ్యూజియాన్ని సం దర్శించాలని సూచిం చారు. ఆలస్యమైతే పెచ్చులూడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన వస్తువులు దెబ్బ తింటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్కే కరీం సేవా సమితి అధ్యక్షులు రాయల్ అబ్దుల్ కరీముల్లా, పర్యాటక అభి మానులు, మ్యూజి యం సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ప్రకటన

కడప జిల్లా, ప్రొద్దుటూరు నందు వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించి D/No - 1)9/489, 9/490, 9/491, 2)9/492, 3)9/493, 9/501 గల షాపు రూములను 3 సంవత్సరముల కాలపరిమితికి నెల బాడుగ ప్రకారము తేది: 26.05.2005న సోమవారం ఉదయం 11-30 గం.లకు దేవస్థానము నందు డిపార్ట్మెంట్ అధికారుల సమక్షమున బహిరంగ వేలము జరుగును. పాల్గొనదలచిన వారు వేలం డిపాజిట్‌ను రూ.5000/-లు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

K.రామచంద్రాచార్యులు, M.A B.Ed.,
కార్యనిర్వహణాధికారి
శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయశాఖ,
ప్రొద్దుటూరు టౌన్, వై.యస్.ఆర్.కడప జిల్లా.

రహదారులకూ నోచని పాతపాలెం

పాతపాలెంలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

పజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పాతపాలెం కనీసం రహదారులకు కూడా నోచుకోవడంలేదు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి కూడా లేదు. గ్రామస్తులు వేరే మార్గాలను ఎంచుకొని ప్రయాణించాల్సి వస్తోంది. గ్రామంలో సిమెంట్ రోడ్లు ఉన్నప్పటికీ మురుగునీరు రోడ్లపై నిలుస్తూ ఇబ్బందికరంగా తయారైంది. చిన్నపాటి వర్షం పడినా నీరు రోడ్డుపై నిలిచి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. గ్రామంలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసి డ్రయినేజీ వ్యవస్థను మెరుగు పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాత పాలెం గ్రామం మైదుకూరు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. అభివృద్ధిలో మాత్రం చాలా వెనుకబడి ఉంది. మున్సిపాలిటీ ప్రారంభ ఎన్నికల్లో ఈ వార్డు నుంచి ఏకగ్రీవంగా అభ్యర్థిని ఎన్నుకున్నప్పటికీ అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాతపాలెం గ్రామంలో డ్రయినేజీ ఏర్పాటు చేసి గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గాన్ని నిర్మించాల్సి ఉంది. ఈ వార్డు పరిధిలోని మరో గ్రామం సర్వాయిపల్లె నుండి మైదుకూరుకు వచ్చేందుకు నేషనల్ హైవే కింది భాగాన ఉన్న కల్వర్టులు వర్షపు నీరు నిలుస్తూ రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారింది. గతంలో అనేకమార్లు ప్రజలు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

విద్య భవిష్యత్తుకు పునాది : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

విద్య భవిష్యత్తుకు పునాది వంటిదని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మధురెడ్డి కల్యాణమండపంలో శనివారం అట్టహాసంగా సంసిద్ధ్ సతీష్‌రెడ్డి పాఠశాలలో టాటా క్లాస్ ఎడ్జ్ ఇంప్రింట్స్ సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన నూతన కోర్సుల ప్రారంభం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో విద్య అనేది ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. అందుకు తగ్గట్టు తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు నచ్చిన విధంగా విద్య పట్ల ప్రోత్సహించాలని సూచించారు. సృజనాత్మక విద్య విద్యార్థుల్లో ఉంటే ప్రపంచాన్ని జయించవచ్చు అన్నారు. 2009లో ఏర్పాటు చేసిన సంసిద్ధ్ గ్రూపు అనేక రాష్ట్రాల్లో పాఠశాలలను నెలకొల్పడం జరిగిందన్నారు. సంసిద్ధ్ పాఠశాల గ్రూపు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి విద్యను అందించాలనే ఉద్దేశంతో వేంపల్లెలో సంసిద్ధ్ సతీష్‌రెడ్డి పేరుతో పాఠశాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు మంచి నాణ్యత విద్యను అందించేందుకు పాఠశాల సిబ్బంది కృషి చేయాలని పాఠశాల ఫౌండర్ సతీష్‌రెడ్డి కోరారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కార్యక్రమంలో సంసిద్ధ్ పాఠశాల గ్రూపు చైర్మన్ శ్రీనివాసరావు, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, సంసిద్ధ్ పాఠశాల రీజనల్ కో-ఆర్డినేటర్ అంజాద్ బాషా, తుషార్ నాగిరెడ్డి, రోహన్ నాగిరెడ్డి, ప్రిన్సిపల్ పరిమళ, చైతన్య, వైసిపి నేతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. భూమి సారవంతం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రకృతి వ్యవసాయం చేస్తే భూమి సారవంతమవుతుందని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని రాజుగురువాయపల్లె గ్రామంలో శనివారం ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేస్తున్న ఎల్-1 రాజుల రామసుధ సొంత పొలంలో సాగు చేసిన ప్రీ మాన్ సూన్ డ్రై సోయింగ్ ప్లాట్ పొలాన్ని ఎఒ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొలకెత్తిన వాటిని పచ్చ పురుగు ఉధృతి నుంచి మొక్కలను కాపాడుకోవడానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి కషాయాలు పిచికారీ చేయాలన్నారు. ప్రకృతిలో లభించే సహజ ఎరువులతో పంటలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. యామవరం, బొందలకుంట, బడుగు వారిపల్లె, రాజు గురువాయపల్లెలో పిఎండిఎస్ పద్ధతిలో పంటలు సాగు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఎన్‌ఎఫ్ఐ రెడ్డి మంజుల, రైతులు పాల్గొన్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - ఖాజీపేట

పంటల సాగు సమయంలో విత్తనాల ఎంపిక పట్ల రైతులు జాగ్రత్త వహించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వీరయ్య, శ్రీవల్లి సూచిం చారు. శనివారం మండల పరిధిలోని తవ్వారుపల్లెలో ఎఒ నాగార్జునతో కలిసి వారు పత్తి పొలాలను పరిశీలించారు. నాన్ బీటీ పత్తి రకాలు మన వాతా వరణానికి అనువైనవి కావని, నాన్ బీటీ విత్తనాలు సాగు చేసేటప్పుడు తగు సూచనలు తీసుకోవాలన్నారు. బీటి-3 పత్తి విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బిటి పత్తి విత్తనాలు ఎవరైనా అమ్ము తుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట : పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కథలు జీవిత వాస్తవాలను స్ఫురింపజేయాలి

మాట్లాడుతున్న కథా రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కథలు జీవిత వాస్తవాలను స్ఫురింపజేయాలని కథా రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి అన్నారు. పిల్లల కోసం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం రెండు రోజులపాటు కథా వసంతం 2కె 25 కార్యక్రమం నిర్వహించారు. మొదటి సెషన్ కథల్లో మానవ సంబంధాల గురించి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కథల్లో సాహస కథలు, జంతువుల నీతి కథలు, విద్యా బోధన కథలుగా విభజించి ఉంటాయి. కథల ద్వారా ఊహాశక్తి పెరుగుతుందన్నారు. ఇది విద్యార్థులకు కీలకమని పేర్కొన్నారు. సైన్స్ ఆవిష్కరణ ఊహ చేసిన తర్వాత నిరూపించబడినవిగా పేర్కొన్నారు. ఏ ఒక్క మనిషి ఒంటరిగా బతకలేడు మనకి తోడుగా కుటుంబం, సమాజం ఉంటుందని తెలిపారు. మన చుట్టూ ఉన్న వారితో, ప్రకృతిలో ఉన్న జంతువులతో, ప్రాణకోటితో ఏర్పడినవే మానవ సంబంధాలు అన్నారు. కథల్లో మానవ సంబంధాలు కీలకమైనవని తెలిపారు. కథల్లో పర్యావరణ స్పృహపై ప్రముఖ కథారచయిత దాదా హయాత్ మాట్లాడుతూ పర్యావరణం అంశాలను కథల్లో జోడించడం ద్వారా ప్రజలందరికీ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చునని అన్నారు. పర్యావరణంపై కథలు ఈ మధ్య కాలంలో తక్కువగా వస్తున్నాయని, దీనిపై మరింత కృషి జరగాలన్నారు. ప్రముఖ కథా రచయిత కావూరి మారుతి విద్యార్థుల్లో దాగి ఉన్న కథా నైపుణ్యాలను బయటకు తీసేలా కార్యక్రమాన్ని నడిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచేందుకు కథా వసంతం ఉపయోగపడుతుందని, కథా వర్క్‌షాపు ద్వారా విద్యార్థులు రాసే కథలతో పుస్తకాన్ని తీసుకు రాబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెవివి నాయకులు సునీత, జిల్లా ఉపాధ్యక్షుడు మురళి గుప్తా, జిల్లా నాయకులు డాక్టర్ మురుకుటి సూర్యనారాయణ రెడ్డి, రాజేష్, శిరీష, వేంపల్లి రాజశేఖర్, మీనా పాల్గొన్నారు.

28 నుంచి నూజివీడు క్యాంపస్‌లో పత్రాల పరిశీలన

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు క్యాంపస్‌లో ఈనెల ఈనెల 28 నుంచి 31 వరకు ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు సర్టిఫికెట్లు పరిశీలన చేయనున్నట్లు రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేషన్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల కింద ప్రతి రోజు సర్టిఫికెట్లను ధృవీకరిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో ఏదైనా ప్రత్యేక కేటగిరికి అప్లై చేయడం మర్చిపోయిన విద్యార్థులు కూడా ధృవీకరణకు హాజరయ్యే అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులు తమకు కేటాయించిన తేదీన ఆయా ప్రత్యేక కేటగిరికి చెందిన సర్టిఫికెట్లను తీసుకొని తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. 28న సిఎపి కింద 153 మంది, స్పోర్ట్స్ కింద 320 మంది విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తామన్నారు. 29న సిఎపి కింద 117, బిఎస్‌జి కింద 247, ఎన్‌సిసి కింద 341, స్పోర్ట్స్ కింద 245 మంది విద్యార్థుల సర్టిఫికెట్లు, 30న ఎన్‌సిసి కింద 452, స్పోర్ట్స్ కింద 467 మంది సర్టిఫికెట్లు, 31న ఎన్‌సిసి కింద 661 మంది విద్యార్థులు సర్టిఫికెట్లను పరిశీలిస్తామని వివరించారు. 2103 మంది విద్యార్థులు ప్రత్యేక కేటగిరీ కింద ట్రిపుల్‌ఐటి సీట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారి సర్టిఫికెట్లను నాలుగు రోజులపాటు పరిశీలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఎవరికీ పట్టని నెర్రవాడ ఎస్‌టి కాలనీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని బద్రిపల్లె పంచాయతీ నెర్రవాడ ఎస్‌టి కాలనీ ఎవరికీ పట్టడంలేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. యానాది, ఎరుకలకు చెందిన 20 కుటుంబాల వారు గత 23 ఏళ్లకుపైగా ఇక్కడ ఉంటున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుండి రోడ్లు, గృహాలు మంజూరు చేయకపోవడంతో పూరి గుడిసెలోనే నివాసం ఉంటున్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు ఈ కాలనీలో వెచ్చించి అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులు నివేదికలు సిద్ధం చేసినప్పటికీ అవి కార్యరూపం దాల్చడంలో విఫలమయ్యాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను ఆ కాలనీలోనే అభివృద్ధి చేయాలని ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. నెర్రవాడ ఎస్‌టి కాలనీ ఆ నిధులకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో నేటికీ ఆ కాలనీ అలాగే ఉండి పోయింది. వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ లేదు. గతంలో విద్యుత్ సరఫరా కూడా లేక నానా అవస్థలు పడేవారు. కాలనీ కంపచెట్ల మధ్య ఉంది. ఈ మధ్యకాలంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంటు వసతి మాత్రం కల్పించారు. ఈ కాలనీ సమీపంలో జగనన్న కాలనీ నిర్మాణం అవుతోంది. పేదలకు స్థలం మంజూరు చేసి గృహాలు నిర్మిస్తున్నారు. నూతన కాలనీతోపాటు తమ కాలనీని కూడా బాగు చేయాలని ఎస్‌సి కాలనీ ప్రజలు కోరుతున్నారు.

పెళ్ల తెరబడి కంపచెట్ల మధ్య ఉన్న ఎస్‌టి కాలనీ

పరీక్ష కరపత్రాన్ని విడుదల చేస్తున్న డిప్యూటీ డిఇఒ, డివైఎఫ్ఐ నాయకులు

మోడల్ డిఎస్‌సి పరీక్షను సద్వినియోగం చేసుకోండి

- డిప్యూటీ డిఇఒ మీనాక్షి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే మోడల్ డిఎస్‌సి పరీక్షను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డిఇఒ మీనాక్షి కోరారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ డిఎస్‌సి పరీక్ష కరపత్రాన్ని శనివారం ప్రొద్దుటూరులో డిప్యూటీ డిఇఒ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ ముందుగా మోడల్ డిఎస్‌సి పరీక్ష నిర్వహిస్తున్న డివైఎఫ్ఐకి అభినందనలు తెలుపుతున్నానన్నారు. పోరాటాలు, ఉద్యమాలు వంటి మాత్రమే కాకుండా నిరుద్యోగులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయమన్నారు. అభ్యర్థులకు ఈ పరీక్ష చాలా ఉపయోగపడుతుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మాట్లాడుతూ ఈనెల 28న నిర్వహించే మోడల్ డిఎస్‌సి పరీక్షలో నిరుద్యోగ అభ్యర్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ పరీక్ష కేవలం ఎస్‌జిటి అభ్యర్థులకు మాత్రమేనని గమనించాలని కోరారు. పరీక్ష జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు కడపలో వెంకటసాయి కోచింగ్ సెంటర్, యుటిఎఫ్ భవన్, ప్రొద్దుటూరు సృజన్ కోచింగ్ సెంటర్, జమ్మలమడుగు ఎస్‌పి డిగ్రీ కాలేజీ, బద్వేలు గౌతం కాలేజీ పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు రూ.50 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు కడప 99127 58515, 9666 64330, ప్రొద్దుటూరు 80080 87023, జమ్మలమడుగు 99127 58515, 91009 95538, బద్వేలు 90594 14222 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మీరి కుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

బద్వేలు : డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే మోడల్ డిఎస్‌సి పరీక్షను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ కోరారు. డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం డిఎస్‌సి మోడల్ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ పరీక్ష ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మేధావులు, నిపుణులతో తయారు చేయించామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె మస్తాన్ షరీఫ్, ఎస్‌కె ఆదిల్, బద్వేల్ రూరల్ కార్యదర్శి ముడుమాల ఓబుల్‌రెడ్డి, పట్టణ నాయకులు సోమేశుల నరసింహ, చరణ్ పాల్గొన్నారు.

సుస్థిర జీవనోపాధి ప్రణాళిక అమలు

ప్రజాశక్తి - వేముల

డ్వాక్రా మహిళల జీవనోపాదుల ప్రణాళిక అమలులో భాగంగా 2025-26 సంవత్సరం ఆర్థిక వనరుల మంజూరుకు సంఘం సూక్ష్మ రుణ ప్రణాళిక తయారీలో భాగంగా ప్రతి డ్వాక్రా మహిళ తన బయోమెట్రిక్ నమోదు ద్వారా రుణాలను పొందవచ్చని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. డ్వాక్రా రుణం పొందడానికి అర్హత అవసరం ఉన్న ప్రతి డ్వాక్రా మహిళను విస్మరించరాదన్నారు. అవసరం లేని వారికి రుణాలు నమోదు చేయరాదని డ్వాక్రా లీడర్లకు సూచించారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి కోసం నిధులు సమీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రాయితీ పథకాలు అనుసంధానం చేయుటకు అన్ని ప్రభుత్వ శాఖలు, సమన్వయంతో సహకరిస్తారని తెలిపారు. గొందిపల్లె, వేముల కొత్తపల్లె, కనంకింద కొట్టాల గ్రామాల్లో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు నమోదు చేస్తున్న సూక్ష్మ రుణ ప్రణాళిక విధానాన్ని తనిఖీ చేశారు. డ్వాక్రా మహిళల అవసరాన్ని దష్టిలో ఉంచుకొని ప్రతి మహిళకు సుస్థిర జీవనోపాధి ప్రణాళికను అమలు చేయుటకు బ్యాంకు లింకేజీ, నారిశక్తి, శ్రీనిధి, సామాజిక పెట్టుబడి నిధి, ఉన్నతి నిధులు, వాటర్ షెడ్ నిధులు, సంఘ నిధి, నిధులను అనుసంధానం చేసి జీవనోపాదుల కార్యక్రమం ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యంమన్నారు. ఆ మేరకు గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు డ్వాక్రా సంఘాలు, గ్రామ సమాఖ్యలు, మండల మహిళా సమాఖ్య పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు జయపాల్, జ్యోతి, గంగరాజు, హరికృష్ణ, నాగేశ్వరి, గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు నందిని, పవన్‌కుమార్, గంగులయ్య, డ్వాక్రా లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తీసుకుంటున్న కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు

క్రైం కార్నర్

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

- బంగారు, వెండి వస్తువులు స్వాధీనం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల ఖాజీపేట పట్టణంలో బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను ఖాజీపేట పోలీసులు అరెస్టు చేశారు. ఆ మేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ సిఐ మోహన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కర్ణాటకకు చెందిన యర్రగొల్లా బసవరాజు, కోరవూరు సంజీవప్ప, గజేంద్రఘడ్ సులభంగా డబ్బు సంపాదించాలని కర్ణాటక రాష్ట్రంలో పందులు దొంగతనం చేయడంతోపాటు చిన్నచిన్న జేబు దొంగ తనాలు చేస్తుండేవారన్నారు. అనంతరం ఆంధ్ర ప్రాంతానికి వచ్చి, పగలు రెక్కీ నిర్వహించి రాత్రివేళ చోరీలకు పాల్పడుతుండేవారని తెలిపారు. వీరితోపాటు మరో ముగ్గురు ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కర్ణాటకకు చెందిన శంకరప్ప, మారుతి, బసవ మోడీకర్ రావాల్సి ఉందన్నారు. ఖాజీపేటలో గత నెల 12న జరిగిన విఎస్ జువెలరీ షాప్ కేసుకు సంబంధించిన నిందితులన్నారు. శనివారం కడప నగరంలోని ఇర్కాన్ సర్కిల్ వద్ద అనుమానస్పదంగా ఉన్నారన్న రాబడిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. వీరిని మైదుకూరు కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు వివరించారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎఎస్ఐ భూపాల్‌రెడ్డి, సిబ్బంది సుధాకర్, తిరుమలయ్య, శివగణేష్, అమరేశ్వర్‌రెడ్డి, నవీన్ కుమార్, బాబును డిఎస్‌పి అభినందించారు. నిందితుల నుంచి వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి, సిఐ